# జైస్వాల్ కమాల్

## యశస్వి 179 నాటౌట్ • భారత్ తొలి ఇన్నింగ్స్ 336/6

ఇంగ్లండ్‌తో రెండో టెస్టు

యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ ఒంటరి పోరాటం చేయడంతో ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో టీమ్‌ఇండియా మెరుగైన స్థితిలో నిలిచింది. మిగిలిన వాళ్లంతా మంచి ఆరంభాలను భారీ ఇన్నింగ్స్‌లుగా మలచడంలో విఫలమైన చోట.. జైస్వాల్ మాత్రం క్లాసిక్ ఇన్నింగ్స్‌తో కదంతొక్కాడు!

తొలి టెస్టులో ఓడి సిరీస్‌లో వెనుకబడ్డ రోహిత్‌సేనకు టాస్ కలిసిరాగా.. దాన్ని వినియోగించుకోవడంలో మనవాళ్లు విఫలమయ్యారు. రోహిత్, గిల్, శ్రేయస్, రజత్, అక్షర్, భరత్ ఇలా ప్రతి ఒక్కరికీ మంచి స్టార్ట్ లభించినా.. దాన్ని వినియోగించుకోలేకపోగా.. బషీర్, రెహాన్ చెరో రెండు వికెట్లు తీశారు.

ఉప్పల్ టెస్టులో శతక్కొట్టే చాన్స్ మిస్ చేసుకున్న యశస్వి.. ఈసారి దుమ్మురేపాడు. ఓ వైపు వికెట్లు పడుతున్నా అదరక బెదరక ఎదురు నిలిచి ధాటిగా పరుగులు రాబట్టాడు. బౌండ్రీతో అర్ధశతకం నమోదు చేసుకున్న జైస్వాల్.. భారీ సిక్సర్‌తో కెరీర్‌లో రెండో సెంచరీ తన పేరిట రాసుకున్నాడు. బౌండ్రీతోనే 150 పరుగుల మార్క్ అందుకున్న జైస్వాల్‌పైనే ఇప్పుడు జట్టు భారం ఉంది. లోయర్ ఆర్డర్‌తో కలిసి అతడు మరెన్ని పరుగులు జోడిస్తాడో చూడాలి!



యశస్వి (179*)

విశాఖపట్నం: యంగ్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (257 బంతుల్లో 179 బ్యాటింగ్; 17 ఫోర్లు, 5 సిక్సర్లు) సూపర్ సెంచరీతో వీర విహారం చేయడంతో ఇంగ్లండ్‌తో రెండో టెస్టులో టీమ్‌ఇండియా భారీ స్కోరు దిశగా సాగుతున్నది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టెస్టులో పరాజయం పాలై 0–1తో వెనుకంజలో ఉన్న రోహిత్ సేన.. వైజాగ్ పోరులో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. మ్యాచ్ సాగుతున్నా కొద్దీ ఈ పిచ్‌పై బ్యాటింగ్ చేయడం కష్టమయ్యే అవకాశం ఉండటంతో నాలుగో ఇన్నింగ్స్‌లో లక్ష్యఛేదన కష్టమని భావించి ఈ నిర్ణయం తీసుకుంది. యశస్వి దూకుడుతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 93 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 336 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు నలుగురు స్పిన్నర్లతో దాడి కొనసాగించగా.. చాన్నాళ్ల తర్వాత టెస్టు మ్యాచ్ ఆడిన వెటరన్ పేసర్ జేమ్స్ అండర్సన్ కూడా ప్రభావం చూపాడు. ఓ ఎండ్‌లో యశస్వి దంచికొడుతుంటే.. మరో ఎండ్ నుంచి అతడికి సరైన సహకారం లభించలేదు. అరంగేట్ర బౌలర్ బషీర్‌కు కెప్టెన్ రోహిత్ శర్మ (14) వికెట్ సమర్పించుకోగా.. శుభ్‌మన్ గిల్ (34), శ్రేయస్ అయ్యర్ (27) ఎక్కువసేపు నిలువలేకపోయారు. గత కొంత కాలంగా టెస్టుల్లో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్న ఈ ఇద్దరు మరో అవకాశాన్ని చేజార్చుకున్నట్లే కనిపిస్తున్నది. సర్ఫరాజ్ ఖాన్‌ను కాదని.. తుది జట్టులో చోటు కల్పించిన రజత్ పాటిదార్ (32) పర్వాలేదనిపించగా.. అక్షర్ పటేల్ (27), శ్రీకర్ భరత్ (17) చివరి సెషన్‌లో స్పిన్నర్లకు తలవంచారు. ఇంగ్లండ్ బౌలర్లలో రేహాన్ అహ్మద్, షోయబ్ బషీర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ప్రస్తుతం యశస్వితో పాటు రవిచంద్రన్ అశ్విన్ (5) క్రీజులో ఉన్నాడు. శనివారం తొలి సెషన్‌లో ఇంగ్లిష్ బౌలర్లను జైస్వాల్ ఎలా ఎదుర్కొంటాడనేది ఆసక్తికరం.

> “సెషన్ల వారిగా ముందుకు సాగా. సుదీర్ఘ లక్ష్యాలు పెట్టుకోలేదు. బౌలింగ్ కట్టుదిట్టంగా సాగినప్పుడు సంయమనం పాటించా. చెత్త బంతి దొరికినప్పుడు ప్రతాపం చూపా. చివరి వరకు ఆడాలనే ఏకైక లక్ష్యం పెట్టుకున్నా.
> –యశస్వి జైస్వాల్

### సంక్షిప్త స్కోరు

భారత్ తొలి ఇన్నింగ్స్: 336/6 (యశస్వి 179 బ్యాటింగ్, గిల్ 34; రెహాన్ 2/61, బషీర్ 2/100),

## సిరాజ్‌కు విశ్రాంతి!

స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతి కల్పించినట్లు టీమ్ మేనేజ్‌మెంట్ వెల్లడించింది. పనిభారాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. ‘గత కొంతకాలంగా సిరాజ్ విరామం లేని క్రికెట్ ఆడుతున్నాడు. అందుకే ఇంగ్లండ్‌తో రెండో టెస్టు నుంచి అతడికి విశ్రాంతి నిచ్చాం. మూడో మ్యాచ్‌కు అతడు అందుబాటులో ఉంటాడు. ఈ నడుమ కుటుంబంతో గడిపేందుకు సిరాజ్‌కు కొంత సమయం చిక్కుతుంది. అతడి స్థానంలో అవేశ్ ఖాన్‌ను జట్టులో చేర్చాం’ అని అందులో పేర్కొంది. అయితే పరిస్థితి మాత్రం దీనికి విరుద్ధంగా కనిపిస్తున్నది. హైదరాబాద్ వేదికగా జరిగిన తొలి టెస్టులో సిరాజ్ నైపుణ్యాలను పూర్తి స్థాయిలో వాడుకోలేదనేది వాస్తవం. రెండో ఇన్నింగ్స్‌లో ప్రమాదకర బంతులు వేసే సిరాజ్‌కు పట్టుమని పది ఓవర్లు కూడా బౌలింగ్ ఇవ్వకపోవడం కెప్టెన్ రోహిత్ పొరపాటే అని విశ్లేషకులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు విశ్రాంతి పేరుతో సిరాజ్‌ను తప్పించి ముఖేశ్ కుమార్‌కు తుది జట్టులో చోటు కల్పించడం కూడా విమర్శలకు తావిచ్చింది. మరోవైపు చాన్నాళ్లుగా జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్న మిడిలార్డర్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌కు తుది జట్టులో చోటు దక్కలేదు. రాహుల్ స్థానాన్ని రజత్ పాటిదార్‌తో భర్తీ చేశారు. దీంతో సర్ఫరాజ్‌ను ఎంపిక చేయకపోవడంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి.

# సెమీస్‌లో యువభారత్

## నేపాల్‌పై 132 పరుగులతో గెలుపు • అండర్-19 ప్రపంచకప్

కెప్టెన్ ఉదయ్, సచిన్ సెంచరీలతో విజృంభించడంతో యువభారత జట్టు అండర్–19 ప్రపంచకప్ సెమీఫైనల్లో అడుగుపెట్టింది. నేపాల్‌తో సూపర్ సిక్స్ పోరులో దుమ్మురేపిన యంగ్ ఇండియా ఇదే జోరులో మరో రెండు మ్యాచ్‌లు గెలిస్తే ఆరోసారి జగజ్జేతగా నిలువనుంది!



ఉదయ్ (100)



సచిన్ (116)

బ్లూమ్‌ఫాంటైన్: అండర్–19 ప్రపంచకప్‌లో యువభారత్ జోరు కొనసాగుతున్నది. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన యంగ్‌ఇండియా వరుస విజయాలతో సెమీస్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన సూపర్ సిక్స్ గ్రూప్–1 పోరులో యువభారత్ 132 పరుగుల తేడాతో నేపాల్‌పై విజయం సాధించింది. కెప్టెన్ ఉదయ్ (100), సచిన్ దాస్ (116) సెంచరీలతో కదంతొక్కడంతో తొలుత బ్యాటింగ్ చేసిన యంగ్‌ఇండియా నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 297 పరుగులు చేసింది. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 215 పరుగులు చేశారు. యంగ్‌ఇండియాకు ఇదే అత్యధిక భాగస్వామ్యం. నేపాల్ బౌలర్లలో గుల్షాన్ మూడు వికెట్లు తీశాడు. అనంతరం భారీ లక్ష్యఛేదనలో నేపాల్ 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేసింది. దేవ్ ఖనల్ (33) టాప్ స్కోరర్.

## ఎదురులేని హైదరాబాద్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీలో వరుస విజయాలతో దూసుకెళ్తున్న హైదరాబాద్.. ఐదో మ్యాచ్‌లోనూ అదే జోరు కొనసాగిస్తున్నది. ప్లేట్ గ్రూప్‌లో భాగంగా శుక్రవారం ప్రారంభమైన పోరులో మన బౌలర్లు సత్తాచాటడంతో మిజోరాం 199 పరుగులకు ఆలౌటైంది. రోహిత్ రాయుడు 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన హైదరాబాద్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఒక వికెట్ కోల్పోయి 120 పరుగులు చేసింది. గత మ్యాచ్ ట్రిపుల్ సెంచరీ హీరో తన్మయ్ అగర్వాల్ (6) త్వరగా పెవిలియన్ చేరగా.. కెప్టెన్ రాహుల్ సింగ్ (81), రోహిత్ రాయుడు (25) క్రీజులో ఉన్నారు. చేతిలో 9 వికెట్లు ఉన్న హైదరాబాద్ ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 79 పరుగులు వెనుకబడి ఉంది. గత నాలుగు మ్యాచ్‌ల్లోనూ ఇన్నింగ్స్ విజయాలు అందుకున్న హైదరాబాద్.. ఈ సారి కూడా అదే దిశగా సాగుతున్నది.

## ఆసీస్ ఘన విజయం



మెల్‌బోర్న్: అరంగేట్ర పేసర్ జేవియర్ బార్ట్‌లెట్ (4/17) విజృంభించడంతో వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా ఘన విజయం సాధించింది. జేవియర్ ధాటికి మొదట విండీస్ 48.4 ఓవర్లలో 231 పరుగులకు ఆలౌటైంది. కార్టీ (88), చేజ్ (59) రాణించారు. ఆసీస్ బౌలర్లలో గ్రీన్, అబాట్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం ఆస్ట్రేలియా 38.3 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 232 పరుగులు చేసింది. జోష్ ఇంగ్లిస్ (65), గ్రీన్ (77 నాటౌట్), స్మిత్ (79 నాటౌట్) అర్ధ శతకాలతో మెరిశారు. జేవియర్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’ అవార్డు దక్కింది.

## అఫ్గాన్ 198 ఆలౌట్



కొలంబో: శ్రీలంకతో జరుగుతున్న ఏకైక టెస్టులో అఫ్గానిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకు ఆలౌటైంది. రహ్మత్ షా (91) టాప్ స్కోరర్ కాగా.. మిగిలినవాళ్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. లంక బౌలర్లలో విశ్వ ఫెర్నాండో 4.. అషిత, ప్రభాత్ చెరో మూడు వికెట్లు పడగొట్టారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన లంక శుక్రవారం ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 80 పరుగులు చేసింది. ఓపెనర్లు దిముత్ కరుణరత్నె (42), నిషాన్ (36) క్రీజులో ఉన్నారు.

## అశ్మిత జోరు

బ్యాంకాక్: భారత యువ షట్లర్ అశ్మిత చలిహ.. థాయ్‌లాండ్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్–300 టోర్నీ మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో శుక్రవారం అశ్మిత 21–14, 19–21, 21–13తో ఎస్తెర్ నురుమి (ఇండోనేషియా)పై విజయం సాధించింది. గంట పాటు సాగిన పోరులో అశ్మిత చక్కటి ప్రదర్శన కనబర్చగా.. పురుషుల సింగిల్స్‌లో మిథున్ మంజునాథన్, మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపీచంద్–త్రిసా జాలీ పరాజయం పాలయ్యారు. మహిళల సింగిల్స్ సెమీస్‌లో నాలుగో సీడ్ కటేటాంగ్‌తో అశ్మిత అమీతుమీ తేల్చుకోనుంది.

## నేటి నుంచి కార్పొరేట్ బ్యాడ్మింటన్ లీగ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్ వేదికగా నేటి నుంచి రెండు రోజుల పాటు కార్పొరేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ జరుగనుంది. ప్రముఖ స్పోర్ట్స్ సర్వీస్ ప్రొవైడర్ గేమ్ పాయింట్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ టోర్నీలో వివిధ కార్పొరేట్ కంపెనీలకు చెందిన ఉద్యోగులు పోటీ పడబోతున్నారు. నిత్యం విధుల్లో బిజీగా ఉండే ఉద్యోగులకు మానసిక, శారీరక ఆరోగ్యం కోసం టోర్నీ ఏర్పాటు చేసినట్లు నిర్వాహకుడు సిద్ధార్థరెడ్డి శుక్రవారం పేర్కొన్నారు. ఉద్యోగులను ఒకతాటిపైకి తీసుకురావడం సంతోషంగా ఉందన్నారు.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.